సాక్షి సంగారెడ్డి

బుధవారం । 12 । ఫిబ్రవరి । 2025



పాత పంటల జాతర

పాత పంటల జాతర మంగళవారం ఝరా సంగం మండల పరిధి మాచ్నూర్ శివారులో ముగిసింది. వివరాలు 8లో ▸



ఇసుక ఫిల్టర్ స్థావరాలపై...

అక్రమ ఇసుక ఫిల్టర్ స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. వివరాలు 8లో ▸



ప్లాస్టిక్ నిషేధం ఉందా?

పటాన్‌చెరు నియోజక వర్గ పరిధిలో రోజు రోజుకు ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతోంది. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

విధిగా నిబంధనలు పాటించాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి



మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి జోన్: గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ విధులు నిర్వహించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో మంగళవారం స్టేజ్1, స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా ఆధ్వర్యంలో మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ఎన్నికల విధుల నిర్వహణలో ఎంత అనుభవమున్నా శిక్షణ చాలా అవసరమన్నారు. నియమ నిబంధనలపై అధికారులు పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎలాంటి వివాదాలకు, తప్పిదాలకు తావు లేకుండా విధులు నిర్వహించాలని వివరించారు. గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని తెలిపారు. సమయ పాలనను పక్కాగా పాటిస్తూ, నామినేషన్ల స్వీకరణ కేంద్రం గదిలో తప్పనిసరిగా గోడ గడియారం అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అధికారులు జానకిరెడ్డి, ఈడీఎస్‌సీ కార్పొరేషన్ రామాచారి, ఏపీడీ బాలరాజు, ఆర్‌వోలు, సహాయ ఆర్‌వోలు,ఎంపీడీవోలు,సంబంధిత ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డ్‌కు వ్యతిరేకంగా రైతుల నిరసన



పశువులతో ర్యాలీ నిర్వహించిన రైతులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం నల్లవల్లి సమీపంలోని ప్యారానగర్‌లో డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసన కార్యక్రమాలు ఏడవ రోజుకు చేరుకున్నాయి. జేఏసీ పిలుపుమేరకు నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తున్నారు. కాగా నిరసనల్లో భాగంగా రైతులు పాడి పశువులతో డంప్‌యార్డ్‌కు వ్యతిరేకంగా వినూత్నంగా రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపారు. డంపింగ్ యార్డ్ వల్ల పచ్చని పొలాలు బీడు భూములుగా మారే దుస్థితి వచ్చిందని, పశువులకు మేత కూడా దొరకని పరిస్థితి నెలకొందని వాపోయారు. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు డంపింగ్ యార్డు ఏర్పాటు నిరసిస్తూ ఏకంగా గ్రామంలోని సెల్ టవర్ ఎక్కి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. డంపింగ్‌యార్డ్ ఆలోచన విరమించుకునే వరకు తమ పోరాటాన్ని ఆపేది లేదని జేఏసీ కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. దీంతో మెదక్- బాలనగర్ జాతీయ రహదారిపై ఆందోళనకారుల నిరసనలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

జీవన ఎరువుల వాడకాన్ని పెంచాలి

జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్



సమావేశంలో పాల్గొన్న వ్యవసాయ అధికారులు

సంగారెడ్డి టౌన్: జీవన ఎరువుల వాడకాన్ని పెంచాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్ రైతులకు సూచించారు. సంగారెడ్డి మండలంలోని పోతిరెడ్డిపల్లి రైతు వేదికలో మంగళవారం జరిగిన రైతునేస్తం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ...రసాయన ఎరువుల మితిమీరి వాడకంతో భూములు సారాన్ని కోల్పోతున్నాయన్నారు. ఫలితంగా ఉత్పత్తుల నాణ్యత క్షీణించి, వ్యవసాయం మనుగడే దెబ్బతినే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని గుర్తించిన రైతాంగం ఇటీవలి కాలంలో రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా, జీవన ఎరువుల వాడకాన్ని సాగులో భాగం చేసుకుంటున్నారని తెలిపారు. అనంతరం రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూపై అప్రమత్తం

- కర్ణాటక సరిహద్దుల్లో మాడ్గి, గంగ్వార్‌ల వద్ద చెక్‌పోస్టులు
- ఇతర రాష్ట్రాల నుంచి కోళ్లు రాకుండా తనిఖీలు
- మండలాల వారీగా ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అప్రమత్తమైంది. జిల్లాలో ఈ వ్యాధి వ్యాపించకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. ఒకవేళ ఫౌల్ట్రీ ఫారాల్లో కోళ్ల అసాధారణ మరణాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇప్పటికే ఫౌల్ట్రీ రైతులకు అవగాహన కల్పించారు. ఆ శాఖ గణాంకాల ప్రకారం జిల్లాలో మాంసం, గుడ్లు ఉత్పత్తి చేసే ఫారాలు 71 కోళ్ల ఫారాలున్నాయి. ఇతర రాష్ట్రాల్లో బర్డ్‌ఫ్లూ అలర్ట్ జారీ అయిన నేపథ్యంలో ఈ శాఖ ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టింది. ఇందులోభాగంగా జిల్లాకు ఉన్న కర్ణాటక సరిహద్దుల్లో రెండు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. గంగ్వార్, మాడ్గిల వద్ద ఏర్పాటు చేసిన ఈ చెక్‌పోస్టుల్లో పోలీసుశాఖ సిబ్బందితోపాటు, పశుసంవర్ధకశాఖ సిబ్బంది క్షుణ్ణంగా వాహన తనిఖీలు చేస్తున్నారు.

అన్ని మండలాల్లో ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలు

జిల్లాలోని అన్ని మండలాల్లో పశుసంవర్ధకశాఖ ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేసింది. ఎక్కడైనా కోళ్లు అసాధారణంగా మరణిస్తే వెంటనే ఆ వ్యాధి ఇతర ఫౌల్ట్రీ ఫాంలకు వ్యాపించకుండా ఈ టీంలు ప్రత్యేక చర్యలు తీసుకుంటాయి. ఈ బృందాల్లోని సభ్యులకు ఈ అంశంపై ఇప్పటికే అవగాహన కల్పించారు. అయితే ఇప్పటివరకు జిల్లాలో కోళ్ల అసాధారణ మరణాలులేవని ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. బర్డ్‌ఫ్లూ అలర్ట్ నేపథ్యంలో జిల్లాలో చికెన్ ధరలపై ప్రభావం పడింది. సంగారెడ్డితో పాటు, పలు పట్టణాల్లో చికెన్ రేట్లు స్వల్పంగా తగ్గాయి.



బ్రాయిలర్ (చికెన్) పౌల్ట్రీ ఫాం

కోళ్ల అసాధారణ మరణాలు లేవు

జిల్లాలో కోళ్ల అసాధారణ మరణాలు లేవు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందస్తుగా జాగ్రత్త చర్యలు చేపట్టాం. బర్డ్‌ఫ్లూ ఫౌల్ట్రీ రైతులకు అవగాహనం కల్పించాం. ఒకవేళ కోళ్ల అసాధారణ మరణాలు జరిగితే సమాచారం ఇవ్వాలని కోరాం. ప్రస్తుతానికి ఎలాంటి ఇబ్బందులు లేవు.

–వసంతకుమారి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

జిల్లాలోనే డ్రగ్స్ డొంక

ఇంటర్‌పోల్ హెచ్చరించే స్థాయిలో

- సంగారెడ్డి జిల్లాలో వెలుగులోకి డ్రగ్స్ దందాలు
- వార్షిక నివేదికను విడుదల చేసిన తెలంగాణ డీసీఏ
- కీలక కేసుల్లో అధికంగా సంగారెడ్డి జిల్లావే
- పారిశ్రామికవాడల్లో యథేచ్ఛగా మాదకద్రవ్యాల తయారీ కేంద్రాలు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: డ్రగ్స్ ఘటనల్లో తీగలాగితే డొంక జిల్లావైపే కదులుతోంది. ఇది ఏస్థాయిలో అంటే ఏకంగా అంతర్జాతీయ నేరాలను నియంత్రించే ఇంటర్‌పోల్ హెచ్చరించేంతగా! తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన దాడులు..నమోదు చేసిన కేసులకు సంబంధించి వార్షిక నివేదికను ఇటీవల విడుదల చేసింది. డీసీఏ డీజీ వి.బి.కమలాసన్‌రెడ్డి విడుదల చేసిన ఈ నివేదికలోని కీలక కేసుల్లో సంగారెడ్డి జిల్లాకు చెందిన కేసులే అధికంగా ఉండటం ఆందోళన రేకెత్తిస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం నిషేధిత డ్రగ్స్ తయారీ, వినియోగం, దందాపై ఉక్కుపాదం మోపుతోంది. ఇందులో భాగంగా డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు, ఎక్సైజ్‌శాఖ అధికారులతో కలిసి రాష్ట్రంలో దాడులు చేస్తున్నారు. ఈ క్రమంలో 2024లో నమోదు చేసిన వివిధ కీలక కేసుల వివరాలను డీసీఏ తన వార్షిక నివేదికలో పేర్కొంది. అందులో సంగారెడ్డి జిల్లాకు సంబంధించి మచ్చుకు కొన్నింటిని పరిశీలిస్తే..

ఇంటర్‌పోల్ హెచ్చరించే స్థాయిలో..

సంగారెడ్డి జిల్లాలో నిషేధిత డ్రగ్స్ తయారీ దందా ఏకంగా అంతర్జాతీయ నేరాలను నియంత్రించే ఇంటర్‌పోల్ హెచ్చరించే స్థాయిలో జరుగుతోంది. కొన్ని నెలల క్రితం ఐడీఏ బొల్లారంలోని పారిశ్రామికవాడలో వెలుగు చూసిన డ్రగ్స్ తయారీ కేంద్రమే ఇందుకు నిదర్శనం. ఇక్కడున్న ఓ ప్రైవేటు పరిశ్రమ నిషేధిత మత్తు పదార్థం సైకోట్రోపిక్ సబ్‌స్టాన్స్ (3 ఎంఎంసీ)ని పెద్ద ఎత్తున తయారు చేస్తోంది. నిషేధిత మత్తు పదార్థాన్ని హంగేరీ వంటి దేశాలకు దొడ్డిదారిన తరలిస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ఈ దందాపై ఆయా దేశాల పోలీసులు ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించారు. ఇంటర్‌పోల్ హెచ్చరిక మేరకు డీసీఏ అధికారులు, ఎక్సైజ్‌శాఖ అధికారులతో ఈ పరిశ్రమలపై దాడులు నిర్వహించగా ఏకంగా రూ.8.99 కోట్ల విలువ చేసే మెటాఫెడ్రోన్ అనే నిషేధిత మత్తు పదార్థం తయారు చేసినట్లు గుర్తించారు. ఈ క్రమంలో మరో పరిశ్రమలో రూ.2.33 కోట్లు విలువ చేసే మాదకద్రవ్యాలు కూడా స్వాధీనం చేసుకున్నారు.

లైసెన్స్‌లు లేకుండా ఔషధాల తయారీ...

ఔషధాలు ఉత్పత్తి చేయాలంటే సంబంధిత శాఖల నుంచి అన్ని రకాల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఆయా శాఖల నిబంధనలను అనుసరించి లైసెన్స్‌లు తీసుకుని ఔషధాలు ఉత్పత్తి చేయాలి. కానీ జిల్లాలోని పలు పారిశ్రామికవాడల్లో ఎలాంటి లైసెన్స్‌లు లేకుండా ఔషధాలు తయారు చేస్తున్న వ్యవహారాలు వెలుగులోకి వచ్చాయి. జిన్నారం మండలం గడ్డపోతారంలో ఓ పరిశ్రమ ఎలాంటి లైసెన్స్ లేకుండానే డపోక్సెటైన్, హైడ్రోక్లోరైడ్ అనే ఔషధాలను తయారు చేస్తున్నట్లు గుర్తించారు. సుమారు రూ.20 లక్షల విలువ చేసే 284 కిలోల ఈ మందులను స్వాధీనం చేసుకున్నారు. గుమ్మడిదల మండలం బొంతపల్లి పారిశ్రామిక వాడలో మరో పరిశ్రమలో లైసెన్స్ లేకుండానే డయాసెరిన్ అనే ఔషధాన్ని ఉత్పత్తి చేస్తున్నట్లు ఈ అధికారుల తనిఖీల్లో తేలింది. రూ.50.25 లక్షల విలువ చేసే 236 కిలోల డయాసెరిన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గతేడాది కాలంగా డీసీఏ అధికారులు చేపట్టిన దాడుల్లో వెలుగు చూసిన వ్యవహారాల్లో ఇవి మచ్చుకు కొన్ని మాత్రమేనని సంబంధితవర్గాలు పేర్కొంటున్నాయి.

‘ప్యాక్స్’లో ప్రత్యేక పాలన!

- పర్సన్ ఇన్‌చార్జిల నియామకానికి ప్రభుత్వం కసరత్తు
- పదవీకాలం పొడిగింపుపై వెలువడని ఉత్తర్వులు
- 14తో ముగియనున్న పదవీకాలం



బీబీపేట ప్రాథమిక సహకార సంఘం భవనం

నారాయణఖేడ్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్-ప్యాక్స్) ప్రత్యేక అధికారుల పాలన కిందకు వెళ్లనున్నాయి. పీఏసీఎస్‌ల పదవీకాలం ఈనెల 14తో ముగియనుండటంతో వీటికి పర్సన్ ఇన్‌చార్జిలను నియమించేందుకు సహకారశాఖ కసరత్తు చేస్తోంది. వాస్తవానికి ప్రత్యేక అధికారుల పాలన కాకుండా పాలకవర్గాల పదవీకాలాన్నే పొడిగించాలని కోరుతూ వస్తున్నారు. అయితే దీనిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. వీరి పదవీకాలం ముగిసేందుకు మరో రెండు రోజులే ఉండటంతో పొడిగింపు ఆశలు సన్నగిల్లాయి. ఇప్పటికే మున్సిపాలిటీల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలనతో కొనసాగుతున్నాయి. ఇక పీఏసీఎస్‌లు సైతం ఇదే బాట పట్టనున్నట్లు తెలుస్తోంది.

జిల్లాలో 53 సంఘాలు

జిల్లాలో డీసీసీబీ పరిధిలో 37 ప్రాథమిక సహకార సంఘాలు ఉండగా స్టేట్ బ్యాంక్ పరిధిలో 16 సంఘాలు కొనసాగుతున్నాయి. మొత్తం సంఘాల్లో 1.20లక్షల మంది రైతులు సభ్యులుగా నమోదై ఉన్నారు. వీటితోపాటు జిల్లాలో ఇటీవల 8 పీఏసీఎస్‌ల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. నాగల్‌గిద్ద మండలంలో నాగల్‌గిద్ద, కంగ్టి మండలంలో తడ్కల్, నిజాంపేట్ మండలంలో నిజాంపేట్, జహీరాబాద్ మండలం, హత్నూర మండలంలో వడ్డేపల్లి, మునిపల్లి మండలం, సదాశివపేట్‌లో ఆత్మకూరు, వట్‌పల్లి మండల కేంద్రంలో నూతనంగా మొత్తం 8 పీఏసీఎస్‌ల ఏర్పాటుకు ప్రతిపాదించారు. కొత్తగా సభ్యత్వం తీసుకునే వారికి ఏడాదిపాటు లావాదేవీలు నిర్వహించిన తర్వాతనే ఓటు హక్కు లభించనుంది. ప్రస్తుతం సభ్యత్వ నమోదు కొనసాగుతోంది. రూ.300 చెల్లించి సభ్యత్వం తీసుకునే వీలుంది. నూతన సభ్యులు ఏడాది తర్వాత ఓటు వేసే అవకాశం ఉంటుంది.

ఆదేశాలకనుగుణంగా చర్యలు

పాలక వర్గాల పదవీకాలం పొడిగింపు, ప్రత్యేక అధికారుల పాలన గూర్చి ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలిస్తే అందుకనుగుణంగా వ్యవహరిస్తాం.

– కిరణ్‌కుమార్, జిల్లా సహకార అధికారి

మల్లయుద్ధం మురిపించె

- పోటీల్లో పాల్గొన్న అంతర్రాష్ట్ర మల్లయోధులు
- పీర్‌గైబ్ సాహెబ్ జాతర ఉత్సవాల్లో భాగంగా...
- విజేతగా నిలిచిన మహారాష్ట్రకు చెందిన కిషన్ జాదవ్



కుస్తీ పడుతున్న మల్ల యోధులు

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ గ్రామ శివారులో గల షరీఫ్ పీర్‌గైబ్ సాహెబ్ జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన కుస్తీ పోటీలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కుస్తీ పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన సుమారు 58 మంది మల్లయోధులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో పలువురు పహిల్‌వాన్‌లు మంచి ప్రతిభ కనబరిచారు. కుస్తీపోటీల్లో మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన కిషన్ జాదవ్ విజేతగా నిలిచారు. కాంగ్రెస్ నేత శుక్లవర్ధన్‌రెడ్డి చివరి కుస్తీ పోటీకి రూ.30వేలు ప్రకటించగా... పహిల్‌వాన్లు పోటీలో పాల్గొనేందుకు పెద్ద ఎత్తున పోటీపడ్డారు. జాతర కమిటీ సభ్యులు ఎంత నచ్చజెప్పినా వారు వినకపోవడంతో ఆ పోటీని రద్దు చేశారు. ఆ ప్రకటించిన మొత్తాన్ని దర్గా అభివృద్ధికి ఇస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించడంతో పహిల్‌వాన్లు పోటీలో పాల్గొనకుండా వెనుదిరిగారు. పోటీల్లో గెలుపొందిన మల్లయోధులకు జహీరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ చంద్రప్ప, పీఏసీఎస్ చైర్మన్ సిద్దిలింగయ్య స్వామి బహుమతులను అందజేశారు.

పోటీకి సై..

ఆసక్తికరంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

- ఉమ్మడి మెదక్ నుంచి 27 మంది నామినేషన్లు
- పట్టభద్రుల ఎమ్మెల్సీకి 22 మంది.
- రేపటి వరకు ఉపసంహరణ గడువు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 77వేల మంది ఓటర్లు



ఉద్యమ, రాజకీయ చైతన్యం కలిగిన మెతుకుసీమ తనదైన ప్రత్యేకతను చాటుతోంది. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఉమ్మడి జిల్లా నుంచి 27 మంది నామినేషన్లు వేశారు. ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలతో కూడిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు సోమవారంతో నామినేషన్ల స్వీకరణ ముగిసింది. నామినేషన్లను కరీంనగర్‌లో స్వీకరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పట్టభద్రులు 70,713 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 7,249 మంది ఉన్నారు.

సాక్షి, సిద్దిపేట: పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 100 మంది నామినేషన్లు వేయగా అందులో ఉమ్మడి మెదక్ నుంచి 22 మంది ఉన్నారు. అందులో సంగారెడ్డి జిల్లా నుంచి 11 మంది, సిద్దిపేట నుంచి 9, మెదక్ నుంచి ఇద్దరు ఉన్నారు. బీజేపీ నుంచి అంజిరెడ్డి (రామచంద్రపురం, సంగారెడ్డి), ఇండిపెండెంట్లుగా పిడిశెట్టి రాజు (కోహెడ, సిద్దిపేట), చంద్రశేఖర్ (కంది, సంగారెడ్డి), దొడ్ల వెంకటేశం (సదాశివపేట్, సంగారెడ్డి), ఎన్ చంద్రశేఖర్ (మెదక్), దేవునూరి రవీందర్ (భరత్‌నగర్, సిద్దిపేట), మంద జ్యోతి (శ్రీనివాసనగర్, సిద్దిపేట), గుమ్మడి శ్రీశైలం (పెద్దలింగారెడ్డిపల్లి, సిద్దిపేట), సంజీవులు (కంది, సంగారెడ్డి), బెజుగం వెంకటేష్ (హౌసింగ్‌బోర్డు కాలనీ, సిద్దిపేట) నామినేషన్లు వేశారు. అలాగే వెంకటేశ్వర్లు (పటాన్‌చెరు, సంగారెడ్డి), సాయిబాబా (తూప్రాన్, మెదక్), మచ్చ శ్రీనివాస్ (దుబ్బాక, సిద్దిపేట), ఎస్.యాదగిరి (ఆర్సీపురం, సంగారెడ్డి), గిరిధర్ (మంజీరానగర్, సంగారెడ్డి), ఇంద్రాగౌడ్ (మర్కూక్, సిద్దిపేట), శంకర్ రావు (పటాన్‌చెరు, సంగారెడ్డి), సత్యనారాయణగౌడ్ (సదాశివపేట, సంగారెడ్డి), లక్ష్మీప్రసన్న (పటాన్‌చెరు, సంగారెడ్డి), నరేందర్ రెడ్డి (జహీరాబాద్, సంగారెడ్డి), ఆంజనేయులు (నంగనూరు, సిద్దిపేట), పోచబోయిన శ్రీహరి యాదవ్ (చిన్నకోడూరు, సిద్దిపేట) నామినేషన్ వేసిన వారిలో ఉన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఐదుగురు

ఉమ్మడి జిల్లా నుంచి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఐదుగురు నామినేషన్లు వేశారు. ప్రస్తుత ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి(చిన్న కోడూరు, సిద్దిపేట), పీఆర్‌టీయూ నుంచి వంగ మహేందర్ రెడ్డి (ప్రశాంత్‌నగర్, సిద్దిపేట) మామిడి సుధాకర్ రెడ్డి (టేక్మాల్, మెదక్), అశోక్ కుమార్ (కొండాపూర్, సంగారెడ్డి), జగ్గు మల్లారెడ్డి (మోయిన్‌పూర, సిద్దిపేట) నామినేషన్లు వేసిన వారిలో ఉన్నారు.

ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో..

ఇప్పటికే పోటీలో ఉన్న అభ్యర్థులు ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో పడ్డారు. గ్రూపులుగా డిన్నర్ పార్టీలను ఏర్పాటు చేస్తున్నారు. తనను గెలిపిస్తే విద్యా అభివృద్ధికి, నిరుద్యోగులకు అండగా ఉంటామని హామీలు గుప్పిస్తున్నారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్లు గురువారం వరకు ఉపసంహరించుకునే అవకాశం ఉంది. దీంతో ఎవరు పోటీలో ఉంటారో తేలనుంది. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరగనుంది. మార్చి 3న కౌంటింగ్ చేపట్టనున్నారు.

బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు

జిల్లా సంక్షేమ అధికారి లలితకుమారి

పటాన్‌చెరు: బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా సంక్షేమ అధికారి లలితకుమారి హెచ్చరించారు. పటాన్‌చెరు ఐసీడీఎస్ కార్యాలయంలో బాల్యవివాహాలు-అక్రమ రవాణపై మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాల్యవివాహాల వల్ల అనర్థాలు, పిల్లల అక్రమ రవాణ, పిల్లలను దత్తత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సీడీపీవో జయరాం, తహసీల్దార్ రంగారావు, డాక్టర్ కల్పన పాల్గొన్నారు.

చెరువులకు మహర్దశ

తెల్లాపూర్‌కు ఎస్‌టీపీ ప్లాంట్ మంజూరు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం ,తెల్లాపూర్ పరిధిలోని చెరువులకు మంచిరోజులు రానున్నాయి. కొన్నేళ్లుగా మురుగుతో నిండిన చెరువులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న సంగతి అందరికీ తెలిసిందే. అందులోభాగంగా చెరువుల పరిరక్షణకు పాలకులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. తెల్లాపూర్‌లో మురుగునీటి శుద్ధి ప్లాంట్ (ఎస్‌టీపీ) ఏర్పాటుకు రూ.60కోట్ల నిధులను మంజూరు చేశారు. అందుకు కావాల్సి భూకేటాయింపు నిమిత్తం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. భూమి కేటాయింపు పూర్తికాగానే పనులు ప్రారంభించేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. అదేవిధంగా రామచంద్రాపురం పట్టణంలోని రాయసముద్రం చెరువు వద్ద సైతం మురుగు నీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటుకు రంగం సిద్ధమవుతుంది. మురుగు చెరువులకు మహర్దశ వస్తుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చెరువులోకి మురుగు నీరు..

తెల్లాపూర్‌లోని మేళ్ల చెరువు, వనం చెరువులలోకి పెద్ద ఎత్తున మురుగు నీరు చేరుతోంది. అదేవిధంగా రాయసముద్రం చెరువుల్లోకి ఆయా కాలనీలకు చెందిన మురుగునీరంతా చేరుతోంది. వాటిని నియంత్రించడంలో అధికారులు పూర్తిగా విఫలమతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



తెల్లాపూర్‌లోని మేళ్ల చెరువు

తనిఖీలు ఎక్కడ...

ప్రధానం గేటెడ్ కమ్యూనిటీ కాలనీలకు చెందిన మురుగు నీరు చెరువులోకి చేరుతున్నా తనిఖీ చేసి నియంత్రణ చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో సమస్య మరింత జఠిలంగా మారింది. గేటెడ్ కమ్యూనిటీ కాలనీలలో తప్పనిసరిగా మురుగునీటి శుద్ధి ప్లాంట్‌లను ఏర్పాటు చేసి అక్కడ్నుంచి బయటకు పంపించాల్సి ఉంది. కానీ అనేక కాలనీల్లో ఎస్‌టీపీ ప్లాంట్‌లు పనిచేయడం లేదని స్థానికులు వాపోతున్నారు.

భూమి కేటాయింపు ప్రతిపాదనలు..

తెల్లాపూర్ ఎస్‌టీపీ ప్లాంట్ ఏర్పాటు కోసం 6ఎకరాల భూమి అవసరం. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలను స్థానిక అధికారులు ఇప్పటికే కలెక్టర్ కార్యాలయంకు పంపించారు. భూకేటాయింపు జరిగిన వెంటనే పనులు ప్రారంభమై రెండేళ్లలో ఎస్‌టీపీ ప్లాంట్ అందుబాటులోకి వచ్చే అవకాశముంది.

చెరువులను కాపాడండి



చెరువుల పరిరక్షణ కోసం పాలకులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. చెరువులలోకి మురుగు నీరు భారీగా చేరుతోంది. అనేక కాలనీలలో ఎస్‌టీపీ ప్లాంట్ పనిచేయడం లేదు. ఈ విషయంపై హైడ్రా అధికారులకు సైతం ఫిర్యాదు చేశాను. అధికారులు వచ్చి పరీక్షల కోసం నీటిని సేకరించి ల్యాబ్ పంపించారు.

–సుంకు వినయ్ కుమార్, విద్యుత్‌నగర్

తనిఖీలు చేస్తున్నాం



మున్సిపల్ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీ కాలనీల్లో నిత్యం మేము మురుగునీటి శుద్ధి ప్లాంట్‌లను తనిఖీలు చేస్తున్నాం. సరిగా నడపని వారికి నోటీసులిస్తున్నాం.

–సంగారెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

నగదు బదిలీ పథకాలపై ఐఐటీహెచ్‌లో సదస్సు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: మారుతున్న సమాజానికి అవసరమైన పరిశోధనలను మరింతగా ప్రోత్సహిస్తున్నామని హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీ.ఎస్.మూర్తి పేర్కొన్నారు. 'షరతులతో కూడిన నగదు బదిలీ పథకాలు'అనే అంశంపై రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సు మంగళవారం ప్రారంభమైంది. కార్యక్రమంలో ప్రొఫెసర్ బీ.ఎస్.మూర్తి మాట్లాడుతూ లింగ సమానత్వం, సామాజిక పరివర్తనను ఎలా ప్రోత్సహించాలనే అంశాన్ని పరిశీలించేందుకు ఈ సదస్సు వేదిక అవుతుందన్నారు. సదస్సులో దేశంలో బాలికలకు సాధికారత కల్పించడంలో ఐఐటీలు బేటీబఛావో.. బేటీ పఢావోలో ఐఐటీల పాత్రను అన్వేషించడం వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో లిబరల్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిందితామజుందార్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే నిర్వహించే దాక పనులు ఆపండి

వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రంపై సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్ గ్రామంలో డంపింగ్‌యార్డ్ ఏర్పాటు చేయబోయే భూములపై సర్వే నిర్వహించే వరకు పనులు ఆపాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది. ప్రైవేట్ వ్యక్తుల భూములు ఉన్నాయని అభ్యంతరాలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో హద్దులు తేలే వరకు పనులు ఆపాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు పేర్కొంది. సర్వే తర్వాత కూడా వివాదం కొలిక్కి రాకుంటే సివిల్ కోర్టును ఆశ్రయించవచ్చని పిటిషనర్లకు సూచించింది. ప్యారానగర్‌లో వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రం ఏర్పాటు కోసం 86.13 ఎకరాల ప్రైవేట్ భూములను అధికారులు చదును చేయిస్తున్నారంటూ రమాదేవితోపాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టి వాదనల అనంతరం మధ్యంతర ఉత్తర్వులిచ్చారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మాసాయిపేటలో ఘటన

చేగుంట(తూప్రాన్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన మాసాయిపేటలోని వైన్స్ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. మాసాయిపేట వైన్స్ వద్ద ఓ వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలను సేకరించారు. మృతుడు చిన్న శంకరంపేట మండలం దర్పల్లి గ్రామంలో నివసిస్తున్న శంకర్(50)గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించి పూర్తి వివరాల నిమిత్తం దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

ముగిసిన పాత పంటల జాతర


జాతరలో ఎడ్లబండ్ల ఊరేగింపు


నృత్యాలు చేస్తున్న గిరిజన మహిళలు

- 35 రోజులపాటు నిర్వహణ
- చిరుధాన్యాలతో అలంకరించిన ఎడ్లబండ్ల ర్యాలీ
- ఆకట్టుకున్న మహిళా రైతుల నృత్యాలు

ఝరాసంగం(జహీరాబాద్): న్యాల్‌కల్ మండల పరిధిలోని వడ్డీ గ్రామంలో ప్రారంభమైన 25వ పాత పంటల జాతర మంగళవారం ఝరాసంగం మండల పరిధిలోని మాచ్నూర్ గ్రామ శివారులో ముగిసింది. డెక్కన్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గత నెల 14న ప్రారంభమై సుమారు 35 రోజులపాటు నియోజకవర్గంలోని 25 గ్రామాల్లో పర్యటిస్తూ చిరుధాన్యాల సాగు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తూ పాత పంటల జాతరను నిర్వహించారు. ముగింపు సందర్భంగా మాచ్నూర్ గ్రామం నుంచి డీడీఎస్ పచ్చ సాలె వరకు చిరుధాన్యాలతో అలంకరించిన ఎడ్లబండ్లను ర్యాలీగా నిర్వహించారు. మహిళా రైతులు డప్పు చప్పుళ్ల మధ్య కోలాటం ఆడుతూ, నత్యాలు చేస్తూ చేరుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు రాములు నాయక్, భవానీ రెడ్డి, గంగాధర్, ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ శరత్ బాబు, ఎన్‌బీజీఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ సైంటిస్టు డాక్టర్ సోమమర్ల, ట్రైనీ కలెక్టర్ మనోజ్, జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి, ఎస్సై నరేశ్, డీడీఎస్ డైరెక్టర్ రుక్మిణి రావుతోపాటు ప్రముఖులు హాజరయ్యారు. జాతర ముగింపు కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సేంద్రియ పద్ధతుల్లో చిరుధాన్యాలను సాగు చేస్తూ భూసారాన్ని కాపాడుతున్న జీవవైవిధ్య సంరక్షకులు చౌహాన్ ధర్మీబాయి, యశోద, శాంతి భాయ్ చౌహాన్, సీతాబాయి చౌహాన్, బైండ్ల సుజాత, మొలిగిరి మంజులమ్మ, తుల్జమ్మతోపాటు జీవవైద్య పంటల సంరక్షణపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో విద్యార్థులకు బహుమతులు అందించారు.

రూ.వెయ్యి బోనస్‌కు కృషి

చిరుధాన్యాలు సాగు చేసే రైతులకు రూ.1000లు అందించే విధంగా కృషి చేస్తామని, అందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు రాములునాయక్, భవాని రెడ్డి, గంగాధర్ వెల్లడించారు. ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ అధ్యక్షుడు శరత్‌బాబు మాట్లాడుతూ... ప్రాంతీయ విత్తన రకాలను కాపాడటంలో సంఘం సభ్యుల పాత్ర కీలకమైందన్నారు. నేడు పెద్ద కంపెనీల దృష్టి పడిందని, మీరు కాపాడిన విత్తనాలను వాళ్ల చేతిలో పడకుండా ఉండేందుకు రిజిష్టర్ చేయాల్సి ఉందని సూచించారు.

మెమెంటోలు, ఫ్రేమ్స్ అందిస్తాం

దేశంలోని వివిధ రాష్ట్రాల వ్యవసాయ, రైతు కమిషన్ సభ్యులతో త్వరలో నిర్వహించే సమావేశాలకు ఇక్కడ మెమెంటోలు, ఫ్రేమ్స్ అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ, రైతు కమిషన్ సభ్యులు వెల్లడించారు. చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరిస్తూ తయారు చేసిన మెమెంటో ఎంతో ఆకర్షణీయంగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

భరోసా సెంటర్ సందర్శన


భరోసా సెంటర్‌ను సందర్శించిన బెంగళూరు సిటీ పోలీస్ బృందం

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్‌ను బెంగళూరు సిటీ పోలీస్ బృందం మంగళవారం సందర్శించింది. ఈ బృందంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ క్షమా మిశ్రాతోపాటు బృందం సభ్యులు సౌమ్య, ఈశ్వరి, సుశ్మాలు ఉన్నారు. ఈ సందర్భంగా వారు కేంద్ర కార్యకలాపాలు, బాధితుల సహాయక వ్యవస్థ, న్యాయపరమైన చర్యలు గురించి అధ్యయనం చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


చిన్నారులతో మాట్లాడుతున్న హేమభార్గవి

నర్సాపూర్ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలలో అందజేస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని నర్సాపూర్ సీడీపీఓ హేమభార్గవి సూచించారు. మంగళవారం నర్సాపూర్ మండలంలోని తూజల్‌పూర్, శివ్వంపేట మండలంలోని గోమారం నవపేట, బిక్య తండా, పిల్లుట్ల అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం గర్బిణులకు, బాలింత మహిళలకు పౌష్టికాహారం అందిస్తోందన్నారు. అంగన్ వాడీ కార్యకర్తలు పిల్లల ఆరోగ్యాన్ని, బరువును పరీక్షిస్తూ భోజనాన్ని అందించాలన్నారు.

వాగులో మహిళ మృతదేహం లభ్యం

న్యాల్‌కల్(జహీరాబాద్): గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన మండల పరిధిలోని హద్నూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. జహీరాబాద్ రూరల్ సీఐ జెక్కుల హన్మంత్ కథనం మేరకు... మంగళవారం ఉదయం పొలానికి వెళ్తున్న రైతులు గ్రామ శివారులోని జల వాగులో మహిళ మృతదేహాన్ని చూశారు. విషయాన్ని పంచాయతీ కార్యదర్శికి తెలిపారు. కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటనా స్థలానికి సీఐ హన్మంత్ చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి గుర్తు పట్టలేని విధంగా ఉంది. మృతురాలు నల్లని రంగు స్వెట్టర్, పసుపు రంగు పట్టు చీర ధరించి ఉన్నట్లు తెలిపారు. నాలుగు నెలల కిందట వాగులో కొట్టుకుని వచ్చి ఉండవచ్చని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ హన్మంత్

ఇంటి నుంచి వెళ్లి.. చెరువులో శవమై తేలి

ఇస్నాపూర్‌లో వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చెరువులో యువకుడి మృతదేహం లభ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ వడ్డెర కాలనీ చెందిన ప్రసాద్ (26) సోమవారం ఇంటి నుంచి స్కూటీ తీసుకొని బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతుకుతుండగా మంగళవారం గ్రామ శివారులోని పెద్ద చెరువు గట్టుపై స్కూటీ, చెప్పులు కనిపించాయి. గజఈతగాళ్ల సాయంతో చెరువులో వెతకగా ప్రసాద్ మృతదేహం లభ్యమైంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రసాద్ ఆర్థిక ఇబ్బందులు లేదా మరేదైనా కారణంతో ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని సోదరుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దీపం అంటుకొని ఇళ్లు దగ్ధం

సుమారు రూ.5.50 లక్షల ఆస్తి నష్టం

రాయికోడ్(అందోల్): అగ్ని ప్రమాదంలో ఇళ్లు దగ్ధమైన ఘటన మండలంలోని మాదాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. బాధితులు, స్థానికుల కథనం మేరకు.. మంగలి విఠల్ భార్య రత్నమ్మ ఇంట్లో మంగళవారం పూజ చేసి దీపం వెలిగించింది. ప్రమాదవశాత్తు ఆ దీపం పక్కనే ఉన్న బట్టలకు నిప్పంటుకుంది. అనంతరం పక్కనే సామగ్రి, ట్రంక్ పెట్టెకు మంటలు వ్యాపించాయి. చుట్టుపక్కల వారు మంటలార్పేందుకు యత్నించారు. అప్పటికే ఇంట్లోని రూ.2.50 లక్షల నగదు, నాలుగున్నర తులాల బంగారం, నగలు కాలిపోయాయి. అలాగే, పక్కనే ఉన్న మంగలి అంజన్న ఇంటికి మంటలంటుకున్నాయి. అతడి ఇంట్లో రూ.50 వేల విలువ గల సామగ్రి దగ్ధమైంది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న ఆర్ఐ శ్రీకాంత్

కుంటలోకి దూసుకెళ్లిన టిప్పర్


బోల్తా పడ్డ టిప్పర్

జిన్నారం (పటాన్‌చెరు): కుంటలోకి టిప్పర్ దూసుకెళ్లిన ఘటన బొల్లారం పారిశ్రామిక వాడలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పారిశ్రామిక వాడలోని ఆసానికుంట సమీపంలో టిప్పర్ డ్రైవర్ ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి అదుపుతప్పి పక్కనే ఉన్న ఆసానికుంటలోకి దూసుకెళ్లింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే అప్రమత్తమైన స్థానికులు డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు.

48 వాహనాలు సీజ్


వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ

సంగారెడ్డి క్రైమ్: జిల్లా హెడ్ క్వార్టర్స్‌లోని కొత్త బస్టాండ్ వద్ద మంగళవారం పట్టణ సీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ రమేశ్ మాట్లాడుతూ.. వాహనదారులు ఇంటి నుంచి బయలుదేరే సమయంలో సరైన పత్రాలు తమ వద్ద ఉండేలా జాగ్రత్త వహించాలన్నారు. వాహనాల తనిఖీల్లో సరైన పత్రాలు లేని 48 వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై సర్దార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బైండోవర్ ఉల్లంఘన

మహిళకు రూ.50 వేలు జరిమానా

అక్కన్నపేట(హుస్నాబాద్): బైండోవర్ ఉల్లంఘనలో ఓ మహిళకు తహసీల్దార్ జరిమానా విధించారు. ఈ ఘటన మండలంలోని కుందనవానిపల్లి గ్రామంలో చోటు చేసుంది. ఎక్సైజ్ శాఖ సీఐ పవన్, ఎస్‌ఐ దామోందర్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన భానోతు సుగుణ గతంలో గుడుంబా తయారీ చేసి అమ్ముతూ పట్టుబడగా బైండోవర్ చేశారు. మరోసారి గుడుంబా అమ్ముతూ పట్టుబడింది. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించినందుకు తహసీల్దార్ అనంతరెడ్డి రూ.50వేలు జరిమానా విధించారు.

మృతదేహాన్ని ఇచ్చారు.. మళ్లీ తీసుకెళ్లారు

- ఒకే శవానికి ఒకే రోజు రెండుసార్లు పోస్టుమార్టం
- మొదట రిపోర్టులు తక్కువ ఇచ్చిన వైద్యులు
- అంత్యక్రియలకు సిద్ధమవుతుండగా మళ్లీ మృతదేహాన్ని తీసుకెళ్లిన పోలీసులు

అల్లాదుర్గం(మెదక్): అనుమానాస్పదంగా మృతి చెందిన ఓ వ్యక్తి మృతదేహానికి వైద్యులు ఒకే రోజు రెండుసార్లు పోస్టుమార్టం నిర్వహించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళ్తే.. రాంపూర్ గ్రామానికి చెందిన గొండ కృష్ణ (28) స్థానిక రైస్ మిల్లులో కూలీగా పని చేస్తున్నాడు. సోమవారం మిల్లు సంపులో పడి మృతి చెందాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి జిల్లా జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు మంగళవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలకు సిద్ధమవుతుండగా పోలీసులు గ్రామానికి చేరుకొని మృతదేహాన్ని మరోసారి జోగిపేట ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టంలో డాక్టర్లు మూడు రిపోర్టులు ఇవ్వాల్సి ఉండగా రెండు మాత్రమే ఇచ్చారని, మరొకటి ఇవ్వలేదని కుటుంబస్తులకు చెప్పారు. దీంతో మరోసారి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ విషయంపై ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డిని వివరణ కోరగా.. ఇన్‌క్వెస్ట్ రిపోర్టు ఇవ్వలేదని, ఆ రిపోర్టు ఇస్తేనే ఎఫ్ఎస్ఎల్‌కు పంపి రిపోర్టు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు.

వ్యాపారంలో నష్టం.. మింగిన ప్రాణం

- ఉరేసుకొని సూపర్ మార్కెట్ వ్యాపారి ఆత్మహత్య
- రూ.కోట్లలో పేరుకుపోయిన అప్పులు
- మెదక్ పట్టణ కేంద్రంలో ఘటన

మెదక్ మున్సిపాలిటీ: సేవా దృక్పథం కలిగిన వ్యక్తి.. మంచి మనసున్న మనిషి.. ఎవరొచ్చి అడిగినా చేతనైన సాయం చేసే వ్యాపారి మల్లికార్జున రమేశ్ ఆత్మహత్య మెదక్ పట్టణ వాసులను కలిచి వేసింది. మెదక్ పట్టణ పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం.. మెదక్ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మల్లికార్జున్ రమేశ్(54) స్థానిక వెంకట్రావునగర్ కాలనీలో ''సాయిదీప్ సూపర్ మార్కెట్'' నిర్వహిస్తున్నారు. స్థానికంగా, చుట్టుపక్కల ప్రాంతాల వారు సాయిదీప్ రమేశ్‌గా పిలుస్తుంటారు. ఈ మార్కెట్ ద్వారా సుమారు వంద మందికి పైగా నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నాడు. కిరాణ వ్యాపారంలో ఓ వ్యాపార దిగ్గజంగా వెలుగొందాడు. ఈ క్రమంలోనే వ్యాపారంలో అప్పులు రూ.కోట్లలో పేరుకు పోయాయి. వాటిని తీర్చే మార్గం కానరాక మంగళవారం ఉదయం ఇంటిపై గల పెంట్‌హౌస్‌లో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు సాయిదీప్ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మల్లికార్జున రమేశ్(ఫైల్)

కన్నీటి పర్యంతమైన పట్టణం

అందరినీ ఆప్యాయంగా పలకరించే వ్యక్తిగా మంచి పేరు తెచ్చుకున్న వ్యాపారి రమేశ్ మృతితో మెదక్ పట్టణం కన్నీటి పర్యంతమైంది. అంత్యక్రియలకు పట్టణంలోని వ్యాపారులు, ప్రముఖులు, సామాన్య ప్రజలు సైతం పెద్ద ఎత్తున తరలివచ్చారు. రమేశ్ మృతి విషయం తెలుసుకున్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రపాల్ హాజరై సంతాపం తెలిపారు.

అప్పుల బాధతో ఉరేసుకొని బలవన్మరణం

కౌడిపల్లి(నర్సాపూర్): అప్పుల బాధతో ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని ధర్మాసాగర్‌లో చోటు చేసుకుంది. మంగళవారం ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కథనం మేరకు.. ధర్మాసాగర్ గ్రామానికి చెందిన పెద్ది నాగరాజు(35) కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. గతేడాది ఇంటి నిర్మాణం కోసం తెలిసిన వారి వద్ద రూ.లక్ష వరకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక నిత్యం బాధపడుతుండేవాడు. సోమవారం భార్యాపిల్లలతో కౌడిపల్లిలో మల్లన్న జాతరకు వెళ్లాడు. అక్కడి నుంచి ముందుగా నాగరాజు ఇంటికొచ్చాడు. కొద్దిసేపటికి భార్య ఇంటికి రాగా ఉరేసుకొని కనిపించాడు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పురుగు మందు తాగి జగిత్యాల వాసి..

కొండపాక(గజ్వేల్): పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొండపాక మండలంలోని వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. జగిత్యాల జిల్లా పుడూర్‌కు చెందిన గట్ల మల్లయ్య (52) కుటుంబీకులు కొన్నేళ్ల కిందట బతుకు దెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. దర్జీ పనిచేస్తూ మద్యానికి బానిసకావడంతో అనారోగ్యానికి గురికావడంతో చనిపోతానంటూ పలుమార్లు కుటుంబీకులను బెదిరించాడు. 10న సాయంత్రం సొంతూరు పూడూరుకు వెళ్తున్నానంటూ చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. అదే రోజు రాత్రి కొండపాక మండలంలోని వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. స్థానికులు 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి అతడి వద్ద ఉన్న ఫోన్ ద్వారా కుటుంబీకులను సమాచారం అందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందడంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రెండు కార్లు ఢీ : ఐదుగురికి గాయాలు

కౌడిపల్లి(నర్సాపూర్): రెండు కార్లు ఢీకొనడంతో ఐదుగురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండలంలోని తునికి గేట్ సమీపంలో 765డి జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. బాధితులు, స్థానికుల కథనం మేరకు.. హైదరాబాద్ శామీర్‌పేటకు చెందిన మాజీ ఎంపీటీసీ నర్సింగారావుకు రాయిలాపూర్‌లో వ్యవసాయ పొలం ఉండగా మల్లికార్జున స్వామి ఆలయం నిర్మించి కొన్నేళ్లుగా జాతర నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఆలయం వద్ద ఉత్సవ ఏర్పాట్లు పరిశీలించేందుకు కారులో డ్రైవర్‌తోపాటు మరో ఇద్దరు ఎలక్ట్రీషియన్లను తీసుకొని వస్తున్నాడు. తునికి గేట్ సమీపంలోనికి రాగానే హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి కారులో మెదక్ వైపు నుంచి వెళ్తూ వీరి కారును ఢీకొట్టాడు. నర్సింగరావుతోపాటు డ్రైవర్, ఎలక్ట్రీషియన్లు, మరో కారులోని వ్యక్తికి గాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేశారు.


ప్రమాదస్థలంలో దెబ్బతిన్న కారు

1000 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు

ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ కృష్ణ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మెదక్ జిల్లాలో వెయ్యి ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందని లీవ్‌పామ్ రిసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ కృష్ణ అన్నారు. మంగళవారం ఆయన హార్టికల్చర్ క్షేత్రస్థాయి అధికారి కార్తీక్‌తో కలసి చిలప్‌చెడ్ మండలం అజ్జమర్రి గ్రామ శివారులో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా కౌడిపల్లి, చిలప్‌చెడ్ మండలాల్లో సుమారు 80 ఎకరాల వరకు రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని, మరికొంత మంది రైతులు సైతం ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. అనంతరం ఆయన ఆయిల్‌పామ్ మొక్కల పెంపకం, ఎరువుల యాజమాన్యం, చీడపీడల బెడద, ఎండాకాలంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచనలు చేశారు. ఆసక్తి ఉన్న రైతులు 83283 50391 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.


అజ్జమర్రిలో ఆయిల్‌పాం మొక్క వద్ద డాక్టర్ కృష్ణ, కార్తీక్

ఇసుక ఫిల్టర్ స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

- రూ.6 కోట్ల విలువైన ఆస్తులు సీజ్
- పోలీసుల అదుపులో 32 మంది

సంగారెడ్డి జోన్: అక్రమంగా ఇసుక తయారు చేస్తున్న స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. దాడులపై ఎస్పీ చెన్నూరి రూపేశ్ మాట్లాడుతూ.. సంగారెడ్డి మండలం ఇస్మాయిల్ ఖాన్ పేట్, కంది మండలంలోని బ్యాతోల్ గ్రామ శివారులలో కొంత మంది అక్రమార్కులు ఇసుక ఫిల్టర్ స్థావరాలను ఏర్పాటు చేసి భూసారాన్ని తగ్గించే విధంగా మట్టిని తవ్వి ఇసుకను తయారు చేస్తున్నారన్నారు. అక్రమ ఇసుక దందాలకు పాల్పడుతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు మంగళవారం జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు, స్పెషల్ పార్టీ టీమ్స్ రెండు బృందాలుగా ఏర్పడి ఆయా గ్రామ శివారులో గల ఇసుక ఫిల్టర్ స్థావరాలపై దాడులు నిర్వహించారన్నారు. ఇస్మాయిల్ ఖాన్ పేట్ గ్రామ శివారులో ఇసుక ఫిల్టర్ వద్ద 3 ఇటాచీలు, 2 జేసీబీలు, 5 ట్రాక్టర్ ట్రాలీ, 10 ట్రాక్టర్ ఇంజన్స్ పట్టుకున్నారన్నారు. బ్యాతోల్ గ్రామ శివారులో ఇసుక ఫిల్టర్ వద్ద 3 ఇటాచీలను సీజ్ చేయడంతో పాటు మొత్తం 32 మందిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. సీజ్ చేసిన వాటి విలువ సుమారు రూ.6 కోట్ల వరకు ఉంటుందన్నారు. అదుపులోకి తీసుకున్న వారిని విచారణ నిమిత్తం సంగారెడ్డి రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించామన్నారు. ఎవరైనా అక్రమ ఇసుక ఫిల్టర్ స్థావరాలను ఏర్పాటు చేసినట్లు తెలిస్తే ఆ వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. దాడులను విజయవంతం చేసిన టాస్క్ ఫోర్స్ సిబ్బంది, స్పెషల్ టీమ్‌కు ఎస్పీ అభినందనలు తెలిపారు.


దాడుల్లో పోలీసులు సీజ్ చేసిన ఇటాచీలు